హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.100	160	180
సూర్యాపేట	రూ.95	140	160
నల్లగొండ	రూ.97	141	160

ఉష్ణోగ్రత గరిష్ఠం 28.0 । కనిష్ఠం 16.4

సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక అవసరాలు తీర్చాలి

జాతీయ కమిషన్ మెంబర్ డాక్టర్ వావా



సమావేశంలో మాట్లాడుతున్న సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ మెంబర్ డాక్టర్ వావా

నల్లగొండ రూరల్, మిర్యాలగూడ టౌన్, జనవరి 8: సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక అవసరాలు తీర్చాలని జాతీయ కమిషన్ మెంబర్ డాక్టర్ వావా కోరారు. సోమవారం కలెక్టరేట్, మిర్యాలగూడ మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. సఫాయి కర్మచారుల కోసం కేంద్రప్రభుత్వం నిర్దిష్ట పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. పరిసరాల పరిశుభ్రత కోసం పాటు పడే స్కావెంజర్లను అక్కున చేర్చుకోవాలన్నారు. వారి అభివృద్ధి, సంక్షేమం కోసం షరతులు లేని రుణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రూ.15లక్షల నుంచి రూ.40లక్షల వరకు రుణ సదుపాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ పథకాలను వారికి అందించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. వారిని ఆయా రంగాల్లో నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సఫాయి కార్మికులకు దుస్తులు, షూస్, గ్లౌజులు అందించాలని, నూనె, సబ్బులు ఇతర వస్తు సామగ్రి ఇవ్వాలని ఆదేశించారు. ప్రతీ మూడునెలలకోసారి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్మికుల పిల్లలకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, మిర్యాలగూడ మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కమిషనర్ పూర్ణచందర్, ఆర్డీవో చెన్నయ్య, డీఎస్పీ వెంకటగిరి, అడ్వైజర్ గిరీంద్రనాధ్, తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాకు వచ్చిన ఆయన్ను కలెక్టర్ హరిచందన మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

సహకార బ్యాంకుల్లో డిపాజిట్ల మాసోత్సవాలు

డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 8: ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని సహకార బ్యాంకుల్లో రెండు మాసాల పాటు డిపాజిట్ల మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం డీసీసీబీలో రూ.665కోట్ల డిపాజిట్లు ఉన్నాయని, జనవరి, ఫిబ్రవరి నెలలో డిపాజిట్ల మాసోత్సవాల సందర్భంగా పెద్ద మొత్తంలో డిపాజిట్లు చేసేలా కృషి చేస్తామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో మూడు నెలలే ఉన్నందున, ప్రతీ ఉద్యోగి, అధికారి డిపాజిట్లపై దృష్టి సారించాలన్నారు. డిపాజిట్లకు రైతులు, ప్రజలు సహకరించాలన్నారు. ఇప్పటి వరకు బ్యాంకు నుంచి రూ.302కోట్ల మేర బంగారంపై రుణాలు గ్రాముకు రూ.4500 చొప్పున ఇచ్చామన్నారు. 333రోజుల డిపాజిట్‌కు వడ్డీ 7.75శాతం చెల్లిస్తామన్నారు. అదేవిధంగా 111రోజుల డిపాజిట్ వడ్డీ 6.50శాతం ఇస్తామన్నారు. సమావేశంలో డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, అంజయ్య, రంగాచారి, రామాచారి, జైరాం, బంటు శ్రీను, కరుణ, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

సీఈవో పోస్టుకు 14 దరఖాస్తులు

జిల్లా సహకార బ్యాంకు సీఈవో పోస్టుకు 14 దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం పనిచేస్తున్న సీఈవో మదన్‌మోహన్ అనారోగ్య కారణాలతో సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానాన్ని భర్తీ చేసేందుకు డీసీసీబీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టుకు నాబార్డుకు చెందిన ఐదుగురు సభ్యులతో కూడిన బృందం ఈనెల 18, 19, 20 తేదీల్లో ఏదో ఒకరోజు ఇంటర్వ్యూలు నిర్వహించి సీఈవోను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది.

కలెక్టర్‌గా హరిచందన బాధ్యతల స్వీకరణ

స్వాగతం పలికిన ఎస్పీ, అదనపు కలెక్టర్




బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

నల్లగొండ, జనవరి 8: జిల్లా కలెక్టర్‌గా దాసరి హరిచందన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆమెకు పలు శాఖల అధికారులు సాదర స్వాగతం పలికారు. తన ఛాంబర్‌కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్‌ను ఎస్పీ చందనా దీప్తి, ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పుష్పగుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పలు శాఖల అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది నూతన కలెక్టర్‌కు పూల బోకేలు అందజేశారు.

12లోగా దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి

రామగిరి: ప్రజాపాలనలో భాగంగా వచ్చిన దరఖాస్తులన్నీ 12వ తేదీలోగా ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన ఆదేశించారు. సోమవారం బాధ్యతలు తీసుకున్న అనంతరం మునిసిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లుతో కలిసి మహిళా డిగ్రీ కళాశాలలో జరుగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఆమె తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పట్టణంలో దరఖాస్తులు ఎన్ని వచ్చాయి, ఇప్పటివరకు ఎన్ని ఆన్‌లైన్ చేశారని అడిగి తెలుసుకున్నారు. దీంతో కమిషనర్ మాట్లాడుతూ, పట్టణంలో 48 వార్డులకు 47,098 దరఖాస్తులు వచ్చాయని, అందులో 20శాతం ఆన్‌లైన్ చేశామని వివరించారు. 14వ తేదీన సంక్రాంతి పండుగ ఉన్నందున 12వ తేదీలోగా దరఖాస్తులన్నీ ఆన్‌లైన్ చేయాలని లేదంటే పండుగ కూడా ఇక్కడే చేయాల్సి ఉంటుందని సిబ్బందితో అన్నారు. ఆమె వెంట మునిసిపల్ డీఈ వెంకన్న, సిబ్బంది తదితరులు ఉన్నారు.



దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

కూరగాయల లోడు పేరిట గంజాయి రవాణా

నల్లగొండ జిల్లాలో రూ.84లక్షల విలువైన గంజాయి పట్టివేత •7లో..



సాదాబైనామాలకు మోక్షం ఎన్నడో?

ప్రభుత్వాలు మారుతున్నా రైతుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. సాదాబైనామాల సమస్య పరిష్కారానికి రైతులు దరఖాస్తులు చేసుకొని మూడేళ్లు గడుస్తున్నా నేటికీ పరిష్కారం లభించలేదు. సాదాబైనామాల దరఖాస్తులు స్వీకరించిన గత ప్రభుత్వం వాటిని పరిష్కరించలేదు. కొత్త ప్రభుత్వంలోనైనా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

- చౌటుప్పల్

దరఖాస్తు చేసుకొని మూడేళ్లు

పట్టాలు రాక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న రైతులు

దశాబ్దాల కాలం క్రితం భూముల క్రయ, విక్రయాలు తెల్లకాగితాలపై జరిగేవి. రిజిస్ట్రేషన్ విధానంపై అవగాహన లేక కొందరు, రిజిస్ట్రేషన్ ఖర్చులను భారంగా భావించి మరికొందరు గతంలో పెద్ద మనుషులు సాక్షులుగా నోటరీ, తెల్ల కాగితాలపై రాసుకొని భూముల క్రయ, విక్రయాలు చేసేవారు. తెల్ల కాగితాలపై రాసుకున్నప్పటికీ ఆ అగ్రిమెంట్ కాగితంతో రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని పహణీలో పేర్లు నమోదు చేయించుకునేవారు. మరి కొంతమంది రైతులు మాత్రం కాగితం రాసుకున్నామనే ధీమాతో రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి రికార్డుల్లో పేరు నమోదు చేసుకునేవారు కాదు. తెల్లకాగితంపై రాసుకున్నవి కావడంతో రెవెన్యూ రికార్డుల్లో అవి మ్యుటేషన్ కాలేదు. దీంతో భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో వారికి పాస్‌పుస్తకాలు జారీ కాలేదు.

అడ్డంకిగా మారిన కొత్త రెవెన్యూ చట్టం

రాష్ట్రంలో రూపుదిద్దుకున్న హైదరాబాద్ రికార్డ్స్ ఆఫ్ రైట్స్ యాక్ట్ 1948 ప్రకారం తెల్లకాగితాలపై రాసుకొని కొనుగోలు చేసిన భూములకు పట్టాలు ఇచ్చే అధికారం తహసీల్దార్లకు గతంలో ఉండేది. అలాగే ఏటా గ్రామాల్లో జమాబందీ నిర్వహించడం ద్వారా నిజమైన దరఖాస్తుదారులను గుర్తించి తహసీల్దార్లు పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసేవారు. 1971లో ఈ చట్టాన్ని అప్పటి ప్రభుత్వం సవరించి రిజిస్ట్రేషన్ పేపర్లు ఉంటేనే, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలనే నిబంధనతో ఆర్‌వోఆర్ యాక్ట్ 1971 అమలులోకి తీసుకొచ్చింది. దీంతో తెల్లకాగితాలపై రాసుకున్న లావాదేవీలు చెల్లకుండా పోయాయి. 1989లో ఈ చట్టాన్ని సవరించి సాదాబైనామాలను పరిష్కరించే అధికారాన్ని మళ్లీ తహసీల్దార్లకు అప్పగించారు. ఈ సవరణ ఆధారంగానే సాదాబైనామాలకు సంబంధించి గత ప్రభుత్వం అప్పట్లో దరఖాస్తులను తీసుకుంది. అయితే 2020 నుంచి అమలులోకి వచ్చిన కొత్త రెవెన్యూ చట్టం ధరణిలో డిజిటల్ రూపంలో ఉన్న రికార్డులను రెవెన్యూ రికార్డులుగా ప్రభుత్వం పరిగణించింది. దీంతో సాదాబైనామాల దరఖాస్తులు ఈ చట్టం పరిధిలోకి రాకుండా పోయాయి. కొత్త చట్టం ప్రకారం పాత ఆర్‌వోఆర్ చట్టం రద్దు కావడంతో సాదాబైనామాల సమస్యలు పరిష్కరించే మార్గం లేకుండా పోయింది. కొత్త చట్టాన్ని సవరిస్తే తప్ప సమస్యకు పరిష్కారం కనిపించడం లేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

సాగులో ఒకరు.. రికార్డుల్లో మరొకరు

సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన భూముల వివరాలు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడంతో అప్పటికే భూములు సాగు చేసుకుంటున్న రైతులు ఇతర వ్యక్తుల నుంచి సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం సాగులో ఒకరు ఉండి, రికార్డుల్లో మరొకరి పేర్లు నమోదై ఉన్నాయి. రికార్డుల్లో పేర్లు నమోదైన వ్యక్తుల వారసులు, కుటుంబ సభ్యుల నుంచి సంబంధిత రైతు లు ఇబ్బందులు పడుతున్నారు.దీంతో ఇరువురిమధ్య వివాదాలు, ఘర్షణలు జరుగుతున్న సందర్భాలు చాలాఉన్నాయి.ఇదే విషయంపై పోలీస్‌స్టేషన్, కోర్టులను ఆశ్రయించిన సందర్భాలూ ఉన్నాయి.

పరిష్కారం కోసం ఎదురుచూపులు

సాదాబైనామాల కింద దరఖాస్తు చేసుకున్న రైతులు సమస్య పరిష్కారం కోసం నిరీక్షిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో సమస్య పరిష్కారం అవుతుందని ఆశించినా దరఖాస్తుదారులకు నిరాశే మిగిలింది. కొత్త ప్రభుత్వంలోనైనా దరఖాస్తులకు మోక్షం లభిస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తు చేసుకోగా, అందులో కొన్ని దరఖాస్తులకు మోక్షం లభించినా, ఇంకా వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సాదాబైనామాలపై దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేవు



సాదాబైనామాల సమస్య పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. గత ప్రభుత్వ హయాంలో రెండుసార్లు రైతుల నుంచి సాదాబైనామాల దరఖాస్తులను ప్రభుత్వం తీసుకుంది. అప్పట్లో కొన్ని దరఖాస్తులను పరిష్కరించాం. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త ప్రభుత్వంలో సమస్య పరిష్కారమవుతుందని రైతులు భావిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

- కేఎంవీ.జగన్నాథరావు, చౌటుప్పల్ ఆర్డీవో

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో..

రాష్ట్ర ఏర్పాటు అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు సాదా బైనామాల దరఖాస్తులను తీసుకుంది. 2014 జూన్ 2వ తేదీలోపు తెల్ల కాగితంపై రాసుకున్న లావాదేవీల రెగ్యులరైజేషన్ కోసం 2016లో మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులను తీసుకుంది. 2020లో మరోసారి సాదాబైనామాల దరఖాస్తులను తీసుకున్నారు. వాటిలో కొన్ని దరఖాస్తులను అధికారులు పరిష్కరించినా అధికశాతం దరఖాస్తులను తిరస్కరించారు. స్పష్టమైన వివరాలు, ఇతర సమాచారం పూర్తిగా లేకపోవడంతో దరఖాస్తులను తిరస్కరించినట్లు అప్పట్లో అధికారులు వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సాదాబైనామాల కింద 54,821 దరఖాస్తులు వచ్చాయి. అందులో యాదాద్రి జిల్లాలో 7,962 దరఖాస్తులు వచ్చాయి. 3,176 దరఖాస్తులను అధికారులు పరిష్కరించి 3,786 దరఖాస్తులను తిరస్కరించారు. నల్లగొండ జిల్లాలో 28,314 దరఖాస్తులు రాగా, అందులో 14,234 పరిష్కరించి, 13,080 దరఖాస్తులను తిరస్కరించారు. సూర్యాపేట జిల్లాలో 18,545 దరఖాస్తులు రాగా, అందులో 8,652 దరఖాస్తులను పరిష్కరించి, 8,564 దరఖాస్తులను తిరస్కరించారు.

నల్లగొండ మునిసిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- అవిశ్వాసానికి 41మంది కౌన్సిలర్ల మద్దతు
- బీఆర్ఎస్‌కు ఐదుగురు, ఒకరు తటస్థం
- గైర్హాజరైన ఎక్స్ అఫీషియో సభ్యులు



అవిశ్వాసం నెగ్గడంతో విజయదరహాసంతో బయటికి వస్తున్న కౌన్సిలర్లు

నల్లగొండ మునిసిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి పై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గింది. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అనుచరుడు సైదిరెడ్డి పదవి నుంచి దిగిపోవాల్సి వచ్చింది.

- రామగిరి

అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మునిసిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ కలెక్టర్‌కు లేఖ ఇచ్చారు. దీంతో సోమవారం అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్‌కేశవ్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మునిసిపాలిటీలో 48 మంది కౌన్సిలర్‌తో పాటు ఇద్దరు ఎక్స్ అఫీషియో సభ్యులు కలిపి మొత్తం 50 మంది ఓటింగ్‌కు పాల్గొనాల్సి ఉంది. అందులో ముగ్గురు గైర్హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే ఇన్‌చార్జి కలెక్టర్ అవిశ్వాస తీర్మాన చట్టాన్ని కౌన్సిల్ సభ్యులకు వివరించారు. అనంతరం అవిశ్వాస తీర్మానికి మద్దతు తెలిపేవారు చేతులెత్తాలని కోరగా, 34 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఐదుగురు బీజేపీ కౌన్సిలర్లు, ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు మొత్తం 41 మంది చేతులెత్తి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్‌కు మద్దతుగా చైర్మన్ మందడి సైదిరెడ్డితోపాటు మరో నలుగు కౌన్సిలర్లు మొత్తం ఐదుగురు మాత్రమే మద్దతు తెలిపారు. కౌన్సిలర్ పిల్లి రామరాజు తటస్థంగా ఉండగా, బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు ప్రసాద్, ఎక్స్ అఫీషియో సభ్యులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి గైర్హాజరయ్యారు. అవిశ్వాసం నెగ్గేందుకు 34 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం కాగా, 41 మంది కౌన్సిలర్లు మద్దతు తెలపడంతో చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ ప్రకటించారు. నిబంధనల ప్రకారం నూతన చైర్మన్‌ను ఎన్నుకునేందుకు అవిశ్వాసం ప్రకటించిన తేదీ నుంచి 30 రోజుల గడువు ఉంటుంది. ఈ మధ్య కాలంలో మరో మారు కౌన్సిల్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి చైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. 2020 జనవరి 25న మునిసిపల్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మందడి సైదిరెడ్డి అవిశాస్వం కారణంగా పదవీ నుంచి దిగిపోవాల్సి వచ్చింది. కాగా, నూతన చైర్మన్ ఎన్నికయ్యేంత వరకు ప్రస్తుత వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ చైర్మన్‌గా వ్యవహరించే అవకాశం ఉంది.



అవిశ్వాసం నెగ్గినట్లు ప్రకటిస్తున్న కలెక్టర్

గత పాలకుల పనితీరుకు వ్యతిరేకంగానే ఓటింగ్



గత పాలకులకు వ్యతిరేకంగానే అవిశ్వాస సమావేశం జరిగింది. నాలుగేళ్ల కాలం లో ఒక్క రోడ్డు తప్ప ఏ వార్డులో కూడా అభివృద్ధి పనులు జరగలేదు. అభివృద్ధి పనులు జరగకపోవడంతో ఆయా వార్డు ప్రజల నుంచి వ్యతిరేకత ఏర్పడే పరిస్థితి వచ్చింది. చైర్మన్‌ను దింపితే తప్ప అభివృద్ధి సాధ్యం కాదనే అవిశ్వాసం పెట్టాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో అందరినీ కలుపుకొని ముందుకెళ్తాం. అవిశ్వాసానికి మద్దతు తెలిపిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు.

- శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మునిసిపల్ ఫ్లోర్ లీడర్

డబ్బుకు అమ్ముడుపోయారు



మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి సహకారంతో నాలుగేళ్లలో వందల కోట్ల రూపాయలతో పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేశాం. అభివృద్ధి పనుల్లో ఏదైనా అవినీతి, అక్రమాలు జరిగితే ప్రజాప్రయోజనాల కోసం అవిశ్వాసం పెట్టాలి. కానీ, బీఆర్ఎస్ బీ-ఫాం మీద గెలిచిన కొందరు కౌన్సిలర్లు డబ్బుకు అమ్ముడుపోయి కాంగ్రెస్‌లో చేరి అవిశ్వాసం తీర్మానం పెట్టారు. ఇది పూర్తిగా స్వార్థ రాజకీయమే. ఇప్పటికే 21 మంది కౌన్సిలర్లకు విప్ కూడా జారీ చేశాం. ఈ విషయం కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లాం. విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేసిన కౌన్సిలర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలని రేపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం. వారి సభ్యత్వాన్ని కలెక్టర్ రద్దు చేస్తారనే నమ్మకం ఉంది.

- మందడి సైదిరెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పని చేయాలి


ఎస్పీ చందనా దీప్తి



గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదులను తీసుకొని బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ చందనా దీప్తి

నల్లగొండ, జనవరి 8: బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా పోలీస్ అధికారులు పనిచేయాలని ఎస్పీ చందనా దీప్తి అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆమె మాట్లాడారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులు, భూ సమస్యలు, భార్యాభర్తల మధ్య విభేదాలు, ఆర్థిక లావాదేవీలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం జరిగేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్‌శాఖ మరింత చేరువ చేయడం లక్ష్యంగా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకొని సంబంధిత ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫిర్యాదుదారుడికి నమ్మకం, భరోసా కల్పించేలా పనిచేయాలన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. బాధితుల ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.







హరిహరులకు విశేష పూజలు



స్ఫటిక మూర్తులను పుష్పాలతో అర్చిస్తున్న అర్చకులు , ప్రధానాలయంలో తిరుప్పావై పాశుర పఠనం చేస్తున్న అర్చకులు, మహిళలు

యాదగిరిగుట్ట, జనవరి 8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి. శ్రీ వైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం లక్ష్మీనృసింహుడికి, శైవాగమ పద్ధతిలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపిన అర్చకులు ప్రధానాలయంలోని ఉత్తర దిశలో మొదటి ప్రాకార మండపంలో ధనుర్మాస వేడుకలను నిర్వహించారు. స్వయంభువులను పంచామృతాలతో అభిషేకించిన అర్చకులు తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య తిరుకల్యాణోత్సం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి మహా మండపంలో స్ఫటిక మూర్తులను అభిషేకించిన అర్చకులు బిల్వ పత్రాలతో అర్చించారు. సాయంత్రం వేళ ఉత్సవ మూర్తులను పల్లకి సేవలో తీర్చిద్ది సేవోత్సవం నిర్వహించారు. ఇదిలా ఉండగా స్వామివారిని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఏఈవో దోర్బల భాస్కర్ స్వామివారి ప్రసాదం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండకింద స్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు గుండ్లపల్లి భరత్‌గౌడ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, ముక్కెర్ల మల్లేశ్‌యాదవ్, బందారపు భిక్షపతిగౌడ్, మారగోని శ్రీరాంమూర్తి, ఎస్‌డీ సలీం, మిట్ట రాంచందర్‌గౌడ్, దేవస్థానం ప్రధానార్చకుడు ఎన్.లక్ష్మీనరసింహాచార్యులు, ఏఈవోలు రాంమోహన్‌రావు, గజ్వేల్ రఘు పాల్గొన్నారు.

బూరుగడ్డ దేవాలయంలో ధనుర్మాస వేడుకలు

హుజూర్‌నగర్ రూరల్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో సోమవారం ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పాశుర పఠనం నిర్వహించారు. గోదాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మణ్‌రావు, గండు సైదులు, రామస్వామి, పూర్ణ పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు శోభాయాత్ర ఆహ్వానపత్రిక

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీవేణుగోపాల-శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 9న నిర్వహించనున్న శోభాయాత్రకు హాజరుకావాలని మంత్రి ఉత్తమ్‌ను ఆలయ ఈవో గుజ్జుల కొండారెడ్డి ఆహ్వాన పత్రిక, దేవాలయ చిత్రపటాన్ని అందజేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు.

ప్రతీ ఇంటిలో రామ నామస్మరణ వినిపించాలి



చౌటుప్పల్‌లో రామపూజిత అక్షింతల శోభాయాత్ర

చౌటుప్పల్ టౌన్/ రామన్నపేట/ జనవరి 8: అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ జరిగే ఈ నెల 22న ప్రతీ ఇంటిలో రామ నామస్మరణ వినిపించాలని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపల్ బీజేపీ ఫ్లోర్‌లీడర్ పీ శ్రీధర్‌బాబు అన్నారు. మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో సోమవారం రామపూజిత అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. అంతకుముందు సీతారామ చంద్ర స్వామి దేవాలయం నుంచి 20 వార్డుల్లోకి అక్షింతల కలశాలతో రామభక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ బత్తుల శ్రీశైలం, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఊడుగు మల్లేశ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఊడుగు వెంకటేష్, సందగళ్ల సతీష్, కామిశెట్టి భాస్కర్, తాడూరి పరమేష్, డి. బిక్షమాచారి, కె.అనంత రెడ్డి, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్, ఊడుగు రమేష్ పాల్గొన్నారు. అదేవిధంగా రామన్నపేట మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ కాలనీలోని ఇంటింటికీ అయోధ్య రామాలయ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ కన్నెకంటి వేంకటేశ్వరచారి, చెన్నకేశ్వర దేవాలయం చైర్మన్ లవణం ఉపేందర్, భక్తులు చిందం లింగయ్య, బాతరాజు అశోక్, కట్కూరి భిక్షపతి, మామిండ్ల ధీరజ్, మెటె సుధీర్, మాంద్ర సత్యనారాయణ, సాయిదీప్, వెంకట్, వంశీ, నామనంది. వినయ్, లవణం, సంతోష్, కొంపల్లి సుదేశ్, శీల నాగభూషణం పాల్గొన్నారు.

కోదాడ ఎంపీపీ కవిత రాజీనామా

కోదాడ రూరల్, జనవరి 8 : సూర్యాపేట జిల్లా కోదాడ ఎంపీపీ చింతా కవిత సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామాపత్రాన్ని ఆమె జిల్లా కేంద్రంలోని జడ్పీ సీఈవో సురేష్‌కు అందజేశారు. దీంతో ఆయన ఆమె రాజీనామాను ఆమోదిస్తూ వైస్‌ఎంపీపీగా ఉన్న మల్లెల రాణికి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఎంపీపీగా కవిత అక్రమాలకు పాల్పడ్డారని, కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ నెలరోజుల కిందట ఏడుగురు ఎంపీటీసీలు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. ఫిర్యాదుపై విచారణ చేసి, మూడు రోజుల్లో నివేదిక సమర్పించాలని కోదాడ ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. విచారణలో ఎంపీపీ కవిత తన పదవీకాలంలో అభివృద్ధి పనుల్లో అక్రమాలతో పాటు మండల పరిషత్‌కు చెందిన భవన సముదాయాలకు సంబంధించిన అద్దె డబ్బులు తీసుకున్నట్లు షాపు యజమానులు ఆర్డీవో విచారణలో తేలింది. అక్రమాలపై ఆర్డీవో రికార్డులు స్వాధీనం చేసుకుని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి, మూడురోజుల కిందటే నివేదికను కలెక్టర్‌కు అందించారు. దీంతో ఎంపీపీపై కలెక్టర్ వేటు వేయడానికి ముందే ఆమె రాజీనామా చేశారు. ఎంపీపీగా కవిత రాజీనామా చేయడంపై మండలంలోని గుడిబండ, రెడ్లకుంట, కాపుగల్లు, గణపవరం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచుకుని, బాణాసంచా కాల్చారు.

కోదాడ ఇన్‌చార్జి ఎంపీపీగా మల్లెల రాణి



ఎంపీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లెల రాణి

కోదాడ ఇన్‌చార్జి ఎంపీపీగా వైస్‌ఎంపీపీ మల్లెల రాణి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ కవిత రాజీనామా చేయడంతో వైస్‌ఎంపీపీ రాణికి బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో సురేష్ ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ కోదాడ మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన రాణిని జడ్పీటీసీ క్రిష్ణకుమారి, ఎంపీటీసీలు క్రాంతికుమార్, కలకొండ సౌజన్య బాలక్రిష్ణ, శంకరశెట్టి కోటేశ్వరరావు, రెడ్లకుంట సర్పంచ్ లీలా అప్పారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి అభినందించారు.

సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్, జనవరి 8: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో కుడి కాల్వకు ఏపీ ప్రాంత తాగునీటి అవసరాల కోసం సోమవారం సాయంత్రం ఆ ప్రాంత నీటి పారుదలశాఖ అధికారులు నీటి విడుదల ప్రారంభించారు. కేఆర్‌ఎంబీ సభ్యుడు అజయ్‌కుమార్ పర్యవేక్షణలో కుడి కాల్వ 5, 7వ నంబరు గేట్ల ద్వారా ఒక్కో గేటు నుంచి 2,500 క్యూసెక్కుల చొప్పున మొత్తం 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏపీ ఎన్నెస్పీ సీఈ మురళీధర్‌రెడ్డి తెలిపారు. రోజుకు ఐదు వేల క్యూసెక్కుల చొప్పున 11 రోజుల్లో మొత్తం ఐదు టీఎంసీల నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేఆర్‌ఎంబీ ఈఈలు రఘునందన్‌రావు, శివశంకర్, లింగంగుంట్ల సర్కిల్ ఎస్ఈ వరలక్ష్మీ, సాగర్ ఏపీ ఈఈ శ్రీహరి, డీఈలు మురళీధర్, వెంకటసుబ్బయ్య, జేఈలు బాలుమీయా, భారతి పాల్గొన్నారు.

సైదులు బాబా.. సమస్యలు తీర్చవా?

కుల, మతాలకు అతీతంగా, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా సమస్యల నిలయంలో కొట్టుమిట్టాడుతోంది. తెలుగు రాష్ట్రాల్లో జాన్‌పహాడ్ దుర్గాకు ప్రత్యేకత ఉంది. కందూరు పేరుతో జాన్‌పహాడ్ సైదన్నకు ఉర్సు సమయంలో లక్షల్లో, ప్రతీ శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు వచ్చి మెక్కులు తీర్చుకుంటారు. ఇదిలా ఉండగా ఈ నెల 25, 26, 27 తేదీల్లో దర్గా ఉర్సు ఉత్సవాలు నిర్వహించనున్నారు. సుమారు 2 లక్షల మంది భక్తులు ఉత్సవాల్లో మొక్కులు తీర్చుకోనున్నారు. ఉర్సు ఉత్సవాలు దగ్గరపడుతున్నా మౌలిక సౌకర్యాల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

● పాలకవీడు

దర్గా వద్ద మౌలిక వసతులు కూడా కల్పించిన నిర్వాహకులు మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తుల నుంచి ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారు. మహిళలు స్నానపుగదులు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, పాలకులు మారుతున్నా భక్తులకు వసతులు కల్పించడంలో పూర్తిగా చెందుతున్నారు. దర్గా పక్కనే కృష్ణమ్మ ప్రవహిస్తున్నా భక్తులకు తాగునీటిని అందించడంలో వక్ఫ్‌బోర్డు అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. తాగు నీరు కోసం చాలా దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల కుళాయి ఏర్పాటుచేసినా ఆ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో భక్తులు ఆ నీటిని తాగడం లేదు. ఉర్సు సమయంలో 2 లక్షల మంది భక్తులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.




నిరుపయోగంగా ఉన్న మంచీనీటి బావి, శిథిలావస్థలో మరుగుదొడ్లు, స్నానపుగదులునిరుపయోగంగా ఉన్న మంచీనీటి బావి, శిథిలావస్థలో మరుగుదొడ్లు, స్నానపుగదులు

ముఖ్యంగా మహిళలకు బట్టలు మార్చుకునేందుకు సరైన సౌకర్యాలు లేవు. మరుగుదొడ్లు అంతంత మాత్రమే. ఉర్సుకు వచ్చిన భక్తులు కందూరు కింద మూగజీవాలను బలిచ్చి అక్కడే వండుకు తింటారు. అయితే షెడ్లు లేకపోవడంతో దుమ్మూధూళి మధ్య ఆరుబయటనే వండుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా దర్గాలో నిద్ర చేస్తే ఆరోగ్యం కుదుట పడుతుందని భక్తుల విశ్వాసం. దీంతో వారు జాగారాల పేరుతో దర్గాలోనే పడుకుంటారు. కోట్ల రూపాయల ఆదాయం ఉన్నా వక్ఫ్‌బోర్డ్ అధికారులు ఈ ప్రాంతంలో భక్తులకు మౌలిక వసతులు కల్పించేందుకు నయా పైసా ఖర్చు చేయలేదు. ఎక్కువగా ఇక్కడికి నిరుపేదలు, గిరిజనులు అధికంగా వస్తారు. ఆదాయం మీద శ్రద్ధ తప్ప భక్తులకు వసతుల కల్పించడంలో వక్ఫ్‌బోర్డు నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ ఏడాది ఉత్సవాల నాటికైనా కనీస వసతులు కల్పించాలని, దర్గా ప్రాంతంలో సీసీరోడ్లు వేసి, మురుగు కాల్వలు నిర్మించాలని, ఇతర సౌకర్యాలు అందించాలని భక్తులు కోరుతున్నారు.

బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారు

జాన్‌పహాడ్ దర్గాకి వచ్చిన భక్తుల దగ్గర కాంటాక్టర్లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. చిన్నతనం నుంచి ప్రతీ ఏడాది దర్గాకు వచ్చి మొక్కులు తీసుకుంటున్నా. ఇప్పుడు ఒక యాటపోతుతో కందూరు చేయాలంటే కాంట్రాక్టర్లకే రూ.3వేల వరకు ఇవ్వాల్సి వస్తోంది. కందూరు ఖర్చు ఎంత ఖర్చు వస్తుందో అంతకంటే ఎక్కువ పైసలు వసూలు చేస్తున్నారు. డబ్బులు తీసుకుంటున్నారు కానీ సరైన సౌకర్యాలు కల్పించడంలేదు. స్నానపు గదులు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదుల్లేక మహిళలు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. భక్తలకు సౌకర్యాలు కల్పించాలి.



● రంగయ్య, భక్తుడు, సూర్యాపేట

దర్గా ఉర్సుకు రూ.13 లక్షల నిధులు కేటాయింపు

జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ రూ.13లక్షల నిధులు కేటాయించారు. స్నానపుగదులు, మరుగుదొడుఉ్ల, విశ్రాంతి గదుల నిర్మాణాలు చేపడతాం. దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

● మహమూద్, వక్ఫ్‌బోర్డు అధికారి, జాన్‌పహాడ్ దర్గా

గ్రామీణ యువతకు ఎస్ఆర్‌టీఆర్ఐలో శిక్షణా కార్యక్రమాలు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 8 : వివిధ రంగాల్లో యువతకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు యాదాద్రిభువనగిరి జిల్లా జలాల్‌పురంలోని రామానందతీర్థ గ్రామీణసంస్థ(ఎస్ఆర్‌టీఆర్ఐ) ఇన్‌చార్జి డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే శిక్షణకు హాజరయ్యే యువకులకు హాస్టల్, భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన - డీడీయూజీకేవై ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణా కార్యక్రమాలకు అర్హత, ఆసక్తిగల గ్రామీణ ప్రాంత అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. మూడు నెలల కాలపరిమితితో ఇంటర్ పాస్ అర్హత గలవారికి బేసిక్ కంప్యూటర్స్(డాటా ఎంట్రీ ఆపరేటర్లు), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్, బీకామ్ పాస్ అయిన వారికి ఎకౌంట్స్ అసిస్టెంట్(ట్యాలీ), పదవ తరగతి పాస్ అయిన వారికి ఆటోమొబైల్- టూవీలర్ సర్వీసింగ్, నాలుగు నెలల కాలపరిమితితో పదో తరగతి పాస్ అయిన వారికి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సోలార్ సిస్టమ్ ఇన్‌స్టిలేషన్, సర్వీస్, ఐదు నెలల కాలపరిమితితో పదో తరగతి పాస్, ఐటీఐ ఉన్నవారికి ప్రాధాన్యత కలిగిన ఎలక్ట్రీషి యన్(డొమెస్టిక్) కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆమె వివరించారు. దరఖాస్తులతో పాటు ఈ నెల 17న ఉదయం 10 గంటలకు సంస్థ కార్యాలయంలో హాజరుకావాలన్నారు. అభ్యర్థులు 18-35 వయస్సు వారై ఉండాలని, గ్రామీణులై ఉండాలని, చదువు మధ్యలో ఉన్నవారు అర్హులు కారన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 9133908000, 9133908111, 9133908222/ 9948466111 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

పెన్‌పహాడ్, జనవరి 8 : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండల కేంద్రంలో షార్ట్‌సర్క్యూట్‌తో మండవ శైలజకు చెందిన పూరిల్లు సోమవారం దగ్ధమైంది. ఘటనా స్థలాన్ని ఆర్ఐ స్వప్న పరిశీలించారు. ఘటనలో ధాన్యం, రూ.25 వేల నగదు, తులం బంగారం, సామాగ్రి కాలిపోయినట్లు ఆర్ఐ తెలిపారు. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందన్నారు. బాధితురాలికి ప్రభుత్వ ఆర్థికసాయం అందేలా చొరవ తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు డిమాండ్ చేశారు.

కూరగాయల లోడు పేరిట గంజాయి రవాణా

నల్లగొండ, జనవరి 8 : కూరగాయల లోడు పేరిట గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.84లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సోమవారం నల్లగొండలోని కార్యాలయంలో ఎస్పీ చందనా దీప్తి విలేకరులకు వివరించారు. మహారాష్ట్రకు చెందిన గ్యానోబా అమోల్ ఫెూరే డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఆ క్రమంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన గంజాయి సరఫరా చేసే జైపాల్ అనే వ్యక్తి పరిచయమైంది. ఈ క్రమంలో గ్యానోబా అమోల్ ఫెూరేకి విజయనగరం నుంచి గంజాయి తీసుకువచ్చి మహారాష్ట్రలో తాను చెప్పిన వ్యక్తికి సరఫరా చేస్తే లక్ష రూపాయలు ఇస్తానని ఫెూరేకి జైపాల్ చెప్పాడు. అందుకు అంగీకరించిన ఫెూరే తనతో పాటు మరో ముగ్గురు మహారాష్ట్రకు చెందిన గణపతి బస్వరాజు సోనాల్, సంఘమేశ్వర సదాశివ జంగనే, ఖయ్యూం ఇశాకేలను ఈ పనిలో భాగస్వామ్యం చేశాడు. విజయనగరంలో గంజాయిని తీసుకుని బయలుదేరారు. వరంగల్ మీదుగా వెళ్తే పట్టుబడతామని భావించి రూటు మార్చి గుంటూరు, మాచర్ల మీదుగా సాగర్‌కు చేరుకున్నారు.

పక్కా సమాచారంతో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అంతర్ రాష్ట్ర ముఠా డీసీఎం వాహనంలో గంజాయిని తరలిస్తోందని తెలియడంతో నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయపురి పోలీస్‌స్టేషన్ ఎస్ఐ సంపత్ తన సిబ్బందితో కలిసి ఏపీ, తెలంగాణ రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు వద్ద తెల్లవారుజామున తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో ఎంహెచ్24ఏయూ5425 నెంబరు కలిగిన డీసీఎం టమోటాల లోడుతో ఆ వాహనాన్ని తనిఖీ చేస్తుండగా అందులో ఉన్న వ్యక్తులు దిగి పారిపోతుండగా వారిని పట్టుకుని వాహనాన్ని తనిఖీ చేశారు. తాము విజయనగరంలో టమాటాల లోడు దించి వస్తున్నామని, ఖాళీ ట్రేలు ఉన్నాయని చెప్పారు. పోలీసు సిబ్బంది పరిశీలించగా, గోధుమరంగు టేప్ చుట్టి ఉన్న 168 గంజాయి ప్యాకెట్లను పేర్చి వాటిపైన 300 ట్రేలు పెట్టినట్లు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు మహారాష్ట్రకు చెందిన వారుగా తెలిపారు. గంజాయి విలువ రూ.84లక్షలు ఉంటుందని, నలుగురి నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ తెలిపారు. మరో నిందితుడైన జైపాల్‌తో పాటు మరో నలుగురు పరారీలో ఉన్నారని వారిని త్వరలో అరెస్టు చేస్తామన్నారు. అక్రమ గంజాయి, మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. ప్రత్యేక నిఘా పెట్టి ఉక్కుపాదంతో అణచివేస్తామన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు తీసుకున్నా, గంజాయి విక్రయాలు చేస్తున్నట్లు తెలిస్తే డయల్ నెంబర్-100కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



నల్లగొండ జిల్లాలో గంజాయితో పట్టుబడిన నిందితులు

రైతులను ఆదుకుంటాం

కొడకండ్ల, జనవరి 8 : సరిపడా సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. సోమవారం ఆయన జనగామ జిల్లా కొడకండ్ల మండలకేంద్రంలోని బయ్యన్న రిజర్వాయర్ వద్ద పూజలు చేసి సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ నియోజకవర్గాలకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సాగు నీరందించేందుకు అనేక ప్రాజెక్టులను కాంగ్రెస్ హయాంలోనే నిర్మించారని తెలిపారు. గత సీఎం కేసీఆర్ కేంద్ర ప్రభుత్వంతో, ప్రధానమంత్రి మోదీతో సత్సంబంధాలు ఏర్పరుచుకోలేదని, రేవంత్‌రెడ్డి సీఎం కాగానే మెరుగయ్యాయన్నారు. కేసీఆర్ రైతులకు ఉచితంగా ఎరువులు ఇస్తానన్న మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, కాంగ్రెస్ నాయకులు అనురాధ, వివేక్ రెడ్డి, అంబేడ్కర్, విజయకుమార్, నీటి పారుదల శాఖ ఈఈ రమేశ్, డీఈలు పాల్గొన్నారు.



బయ్యన్న రిజర్వాయర్ వద్ద ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సామేలు

బైక్‌ను ఢీకొన్న కారు: యువకుడి మృతి

అర్వపల్లి, జనవరి 8 : బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం బొల్లంపల్లి గ్రామ స్టేజీ వద్ద సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అర్వపల్లి మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన పాల్వాయి శివకుమార్(25) అర్వపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో బొల్లంపల్లి గ్రామ స్టేజీ వద్ద సూర్యాపేట-జనగాం జాతీయ రహదారి(365)పై తుంగతుర్తి నుంచి అర్వపల్లి వైపు వస్తున్న కారు బైక్‌ను ఎదురుగా అతివేగంతో ఢీకొట్టి, 10 మీటర్ల వరకు కారు యువకుడిని ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. తండ్రి పాల్వాయి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజిరెడ్డి తెలిపారు.



పాల్వాయి శివ కుమార్(ఫైల్‌ఫొటో)

శబరిమలలో గుండెపోటుతో ...

18 మెట్లు ఎక్కుతుండగా ఘటన

ఆత్మకూర్(ఎస్), జనవరి 8 : అయ్యప్ప ఇరుముడి చెల్లింపు కోసం శబరిమలకు వెళ్లిన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలానికి చెందిన వ్యక్తి గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. మరో ఐదు నిమిషాల్లో స్వామి దర్శనం అవుతుందనగా గుండెపోటుకు గురయ్యారు. మండలంలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన ఉయ్యాల లింగయ్య(37) నాలుగు రోజుల కిందట ఇరుముడితో వెళ్లి శబరిమలలో 18 మెట్లు ఎక్కే సమయంలో గుండెపోటుతో కుప్పకూలాడు. స్థానికులు భద్రత సిబ్బంది ప్రథమ చికిత్స చేసినప్పటికీ లింగయ్య మృతి చెందాడని అక్కడి స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులకు, గ్రామస్థులకు సమాచారం అందింది. లింగయ్య కొంతకాలంగా సూర్యాపేట పట్టణంలో నివాసముంటూ వాటర్ ప్లాంటు మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గత గురువారం శబరిమల దర్శనానికి ఇరుముడితో వెళ్లి గుండెపోటుతో మృతి చెందడం గ్రామస్తులను ఆవేదనకు గురిచేసింది. శబరిమల ట్రస్టు సహకారంతో లింగయ్య మృతదేహాన్ని స్వగ్రామం తుమ్మల పెన్‌పహాడ్ కు తీసుకువస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. లింగయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



లింగయ్య(ఫైల్‌ఫొటో)

జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య

రామన్నపేట, జనవరి 8 : యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేటలో జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ కే సాలకమ్మ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామన్నపేటకు సంజీవయ్యనగర్ కాలనీకి చెందిన బొడ్డు శ్రీరాములు(45) పూలవ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసై తరుచూ ఇంటికి తాగి వస్తున్నాడు. మద్యం తాగి వచ్చిన శ్రీరాములును ఆయన కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టాలపై మృతదేహాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. శ్రీరాములు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ కే సాలకమ్మ తెలిపారు. శ్రీరాములుకు భార్య, ఇద్దరు కుమార్తె, కుమారుడు ఉన్నారు.



శ్రీరాములు(ఫైల్‌ఫొటో)

ఆంధ్రజ్యోతి ఎడిటర్ మాతృమూర్తి అస్తికల నిమజ్జనం

దామరచర్ల, జనవరి 8 : ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాతృమూర్తి కండ్లకుంట రంగనాయకమ్మ అస్తికలను నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద సోమవారం నిమజ్జనం చేశారు. కుటుంబసభ్యులతో పాటు బంధువులు వాడపల్లిలోని కృష్ణా-మూసీ నదుల సంగమం వద్ద మరబోటులో వెళ్లి అస్తికలను నిమజ్జనం చేశారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా కండ్లకుంట రంగనాయకమ్మ తల్లిగారి స్వస్థలం నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు.

కుటుంబ కలహాలతో భర్త దాడి

● అనంతరం తనకు తానుగా కత్తిపోట్లు

● ఇద్దరి పరిస్థితి విషమం

చివ్వేంల, జనవరి 8: కుటుంబ కలహాలతో భార్యపై దాడి చేసిన భర్త అనంతరం తనకు తాను కత్తితో పొడుచుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆదివారం అర్థరాత్రి మండలంలోని కుడకుడలో చోటుచేసుకుంది. ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం కుడకుడ గ్రామానికి చెందిన కప్పల శ్రీను-స్వప్న దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీను కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం అర్థరాత్రి వీరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహంతో ఉన్న శ్రీను భార్య స్వప్నపై కత్తితో, కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన భార్యను చూసిన శ్రీను ఇంట్లో ఉన్న పురుగుల మందును తాగి భార్య స్వప్నపై దాడి చేసిన కత్తితో తనకు తానుగా పొడుచుకొని ఆత్మహత్యకు యత్నించాడు. దాడి సమయంలో అరుపుకేకలు వినబడటంతో చుట్టుపక్కల వారు శ్రీను ఇంట్లోకి వెళ్లి చూశారు. అప్పటికే గాయాలతో ఉన్న ఇద్దరిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి విషమంగానే ఉన్నట్లు సమాచారం. స్వప్న తండ్రి జెజ్జూరి రాజయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాంప్లెక్స్ దుకాణాలకు టెండర్లు పిలువాలి

మిర్యాలగూడ, జనవరి 8: పట్టణంలోని మునిసిపల్ కాంప్లెక్స్ షాపులకు టెండర్లు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో చెన్నయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. షాపులకు టెండర్లు పిలవకపోవ డంతో దళారుల దందా నడుస్తుందన్నారు. ఎంతోమంది నిరుద్యోగులు, చిరు వ్యాపారులు జీవనోపాధి కోసం దళారుల వద్ద షాపులు అద్దెకు తీసుకుని నెలకు రూ.25 నుంచి రూ.30వేల వరకు చెల్లిస్తున్నారని ఆరోపించారు. మొత్తం 92 షట్టర్లుండగా సగానికిపైగా దళారుల ఆధీనంలోనే అద్దెకు ఇస్తున్నారని ఆరోపించారు. మునిసిపాలిటీకి రావాల్సిన లక్షలాది రూపాయల ఆదాయాన్ని దళారులు స్వాహా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు రాయంచు నర్సింహ్మా, మురళీ, గంగాధర్, గోపి, రాములు తదితరులు ఉన్నారు.

పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి


బాల్‌రెడ్డి, శంకర్

నల్లగొండ, జనవరి 8: పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడిగా చిలుముల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె. శంకర్, గౌరవాధ్యక్షుడిగా కందిమల్ల కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. తమ నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శప్రాయం


మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

నల్లగొండ, జనవరి 8: సావిత్రిబాయి పూలే జీవితం మహిళలకు ఆదర్శపాయమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి. నాగమణి అన్నారు. సావిత్రిబాయి జయంతి పురష్కరించుకొని రామానంద తీర్థ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో టీఎస్ డబ్ల్యూఆర్ఎస్, బాలికల పాఠశాల నిడమనూరు మహిళ ఉపాధ్యాయులు సోమవారం నిర్వహించిన వేడకల్లో వారు మాట్లాడారు. దేశంలో మహిళలకు కోసం మొదటి సారిగా పాఠశాలను నెలకొల్పి విద్యను అందించిన వీర వనిత సావిత్రి పూలే అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎం. అరుణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, ప్రధాన కార్యదర్శి పెరమాళ్ల వెంకటేశం, జిల్లా కార్యదర్శి నలపరాజు వెంకన్న, కొమరాజు సైదులు, లింగంపల్లి అంజయ్య, ఉపాధ్యాయులు దివ్య, జ్యోతి, లావణ్య, మమత, రజిత, స్వప్న, శివాని తదితరులు పాల్గొన్నారు.

సంత్‌సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

మిర్యాలగూడ అర్బన్, జనవరి 8: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీసంత్‌సేవాలాల్ జయంతి రోజు ఫిబ్రవరి 15ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం డివిజన్ అధ్యక్షుడు పానుగోతు నాగరాజునాయక్ కోరారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సంత్‌సేవాలాల్ జయంతి ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లావూడి బాలాజీనాయక్, రమేష్‌నాయక్, ధీరావత్ మంజునాయక్, ధీరావత్ చాంప్లనాయక్, మాండన్ రాజు, ఇస్లావత్ హరినాయక్, కిశోర్‌నాయక్, శివనాయక్, జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల డేటా ఎంట్రీ త్వరగా పూర్తిచేయాలి

మిర్యాలగూడ రూరల్, జనవరి 8: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాల అమలు కోసం ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల డేటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఈ నెల 17 వరకు డేటా ఎంట్రీ పూర్తి చేయాలని వారికి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతిలక్ష్మీ, తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

కొండమల్లేపల్లి, జనవరి 8: హనుమాన్ శక్తి జాగరణ ఆధ్వర్యంలో సోమవారం కొండమల్లేపల్లిలో అయోధ్య రాముడి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హనుమాన్ శక్తి జాగరణ సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల పరమేశ్, మహేశ్వరం శివయ్య, కందుల వెంకట్‌రెడ్డి, తోటపల్లి శ్రీను, కళమ్మ, భూతరాజు భరత్‌కుమార్ పాల్గొన్నారు.

తిప్పర్తి: అయోధ్య రామాలయ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని రాజుపేటలో నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, పురుషోత్తం, సైదాచారి, జానయ్య, వెంకటయ్య, నర్సయ్య, అంజి, మహేష్ ఉన్నారు.

నేను బతికే ఉన్నా.. కలెక్టర్‌కు రైతు మొర


శంకర్

నల్లగొండ, జనవరి 8: 'నేను బతికే ఉన్నాను చచ్చిపోలేదు' అంటూ నల్లగొండ జిల్లాలో ఓ రైతు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశాడు. తాను చనిపోయినట్టు వ్యవసాయశాఖ వెబ్‌సైట్‌లో చూపిస్తుండటంతో రుణమాఫీ కావడం లేదని అందులో పేర్కొన్నారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శాలిగౌరారం మండలం ఊట్కూరు గ్రామానికి చెందిన నల్లగంటి శంకర్‌కు గ్రామంలో ఎకరం 31 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమి మీద బ్యాంక్‌లో 2015లో రూ.40వేలు రుణం తీసుకుని 2016లో వడ్డీతో సహా చెల్లించాడు. అదే సంవత్సరం తిరిగి రూ.40వేలు రుణం తీసుకున్నాడు. అది ప్రస్తుతం వడ్డీతో కలిసి రూ.65,614 అయింది. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం రూ.లక్ష వరకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించడంతో తన రుణం కూడా మాఫీ అవుతుందని భావించాడు. ఎంతకూ మాఫీ కాకపోవడంతో మొదట బ్యాంక్ అధికారులను సంప్రదించాడు. ఆ తర్వాత వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లాడు. వ్యవసాయ శాఖ అధికారులు తమ వెబ్‌సైట్‌లో శంకర్ మృతి చెందినట్టు తప్పుగా రికార్డు చేశారు. దీంతో ఆయనకు రుణమాఫీ అవ్వడం లేదు. తప్పును సరిదిద్దాలని అధికారుల చుట్టూ తిరిగినా స్పందన లేకపోవడంతో సోమవారం కలెక్టరేట్ వచ్చాడు. తాను చనిపోలేదని పేర్కొంటూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు.


అవిశ్వాస తీర్మాన సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

టెన్షన్.. అటెన్షన్

నల్లగొండ మునిసిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై అవిశ్వాసం నెగ్గింది. అవిశ్వాస లేఖను కాంగ్రెస్ కౌన్సిలర్లు ఇటీవల కలెక్టర్‌కు అందజేశారు. సోమవారం 48 మంది కౌన్సిలర్లతో పాటు ఇద్దరు ఎక్స్‌అఫిషియోతో కలుపుకొని మొత్తం 50 మంది సభ్యులతో అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని సిద్ధం చేశారు. తీర్మాన సమావేశం ప్రారంభమైన క్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధ్యక్షతన అవిశ్వాస తీర్మాన సమావేశం జరిగింది. అవిశ్వాస తీర్మానం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

● రామగిరి,


మునిసిపల్ కార్యాలయం వద్ద భారీగా మోహరించిన పోలీసులు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చైర్మన్ ఒంటెద్దు పోకడవల్లే అవిశ్వాసం



మునిసిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి ఒంటెద్దు పోకడ వల్లే అవిశ్వాసం పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగేళ్లుగా పలు వేధింపులు, అవమానాలకు గురి చేశారు. పట్టణంలో ఒక్క హైదరాబాద్ రోడ్డు తప్ప ఏ వార్డులో కూడా అభివృద్ధి పనులు జరగలేదు. నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. గతంలో ఒకసారి చైర్మన్‌కు వ్యతిరేకంగా క్యాంప్ కూడా ఏర్పాటు చేశాం. బీఆర్ఎస్‌కు చెందిన 21మంది కౌన్సిలర్లలో 16మంది అవిశ్వాసానికి మద్దతు తెలిపారు. ఇలాంటి సందర్భంలో విప్ ఎలా జారీ చేస్తారు.

● అబ్బగోని రమేష్, మునిసిపల్ వైస్‌చైర్మన్

అహంకారానికి, అధికార దాహానికి మధ్య పోరు ఇది



అహంకారానికి, అధికార దాహానికి మధ్య జరుగుతున్న పోరు ఇది. కుర్చీ కోసం కోట్లాటలా ఉంది. నాడు బీఆర్ఎస్‌కు సరైన బలం లేకున్నా ఎక్స్ అఫీషియో ఓట్లతో చైర్మన్ పీఠం దక్కించుకుంది. దాన్ని నేడు నిలుపుకోలేకపోయింది. చైర్మన్ పదవి నుంచి దింపడాన్ని స్వాగతిస్తున్నా. కంచర్ల భూపాల్‌రెడ్డి అహంకారం, కక్ష సాధింపు ధోరణి వల్లే ఓటమి పాలయ్యారు. నూతనంగా ఎన్నికయ్యే చైర్మన్ ప్రజలకు అందుబాటులో ఉండాలి. నిలిచిపోయిన అభివృద్ధి పనులు కొనసాగించాలి. మునిసిపల్ కార్యాలయంలోని అధికారులు ఎవరు అధికారంలో ఉంటే వారు చెప్పింది వినకుండా అందరి సమస్యలు పట్టించుకొని పరిష్కరించాలి. బీఆర్ఎస్ నుంచి నన్ను తొలిగించినందున విప్ వర్తించదు.

● పిల్లి రామరాజు, బీఆర్ఎస్ బహిష్కృత కౌన్సిలర్

ప్రజాసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



డిండిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

డిండి, జనవరి 8: ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం వహించొద్దని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాదవరం సునీత అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్యంలో మాట్లాడారు. ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. ఆరు గ్యారెంటీలు అర్హులైన పేదలకు అందించాలన్నారు. డిండి ప్రాజెక్టుకు నూతనంగా నిర్మించిన షెట్టర్లు లీకవుతుండడంతో సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు నిలిపివేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో డానియేల్, పంచాయతీ ఏఈ విజయ్‌కుమార్, ఎంఈవో సామ్యనాయక్, హాస్టల్ అధికారి నాగరాజు, డాక్టర్ షాలీని, రేణుక, నాగేశ్వర్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, సర్పంచ్ సాయమ్మకాశయ్య ఉన్నారు.

దేవరకొండ: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని వైదొని వంపు గ్రామంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ఎంపీపీ జాన్‌యాదవ్, మల్లేపల్లి ఎంపీపీ రేఖాశ్రీదర్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, సిరాజ్‌ఖాన్, సర్పంచ్ పాపమ్మ, దేవేందర్‌నాయక్, భాస్కర్‌రెడ్డి, ఇందిరా, కొర్ర రాంసింగ్, కిన్నెర హరికృష్ణ, విజయ్, అంజయ్య, ఆంజనేయులు, లక్ష్మణ్, సీత్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించాలి

నల్లగొండ, జనవరి 8: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాదవ, కురుమల కోసం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. గొర్రెల యూనిట్లను ఇవ్వాలని లేదా కట్టిన డీడీల పైసలు అయిన ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం 32జిల్లాల్లో 80వేల మంది రూ.43,750లు యాదవ, కుర్మలు డీడీలు కట్టారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బస్సు సర్వీసులను పొడిగించాలి

చిట్యాల రూరల్, జనవరి 8: హైదరాబాద్ నుంచి వచ్చే సిటీ బస్సులను చిట్యాల వరకు పొడిగించాలని కోరుతూ వెలిమినేడు మండల సాధన సమితి అధ్యక్షుడు పోలగోని శివప్రసాద్ ఆర్టీసీ ఎండీ. సజ్జన్నార్‌కు వినతిపత్రం అందజేశారు. చిట్యాల నుంచి హైదరాబాద్‌కు వందలాది మంది వెలుతుంటారని సిటీ బస్సులు చౌటుప్పల్ వరకు వస్తుంటాయిని అవే బస్సు సర్వీసులు చిట్యాల వరకు పొడిగిస్తే వెసులుబాటు ఉంటుందన్నారు.

పీఏసీఎస్ సమావేశంలో రభస

చిట్యాల రూరల్, జనవరి 8: మండలంలోని గుండ్రాంపల్లి పీఏసీఎస్ పాలకవర్గ సమావేశాన్ని కోరం లేకుండా ఎలా నిర్వహిస్తారని సభ్యులు దోర్నాల రామచంద్రయ్య, బొడిగె సైదులు ప్రశ్నించారు. తమకు సమాచారం ఇవ్వకుండా నసమావేశం నిర్వహిస్తున్నారని నిరసన తెలిపారు. తమకు సమాచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించారని జమ, ఖర్చుల వివరాలు చెప్పకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. సభ్యులందరూ లేకుండానే సమావేశం నిర్వహించకుండా నిర్వహించినట్లుగా వ్యవహరించడం తగదన్నారు. సమావేశాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పీఏసీఎస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డిని వివరణ కోరగా సంఘంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని అంతా పారదర్శకంగానే ఉందన్నారు. సభ్యులకు సమాచారమిచ్చినా వారు సమయానికి రాక అసంబద్ధ ఆరోపణలు చేయడం తగదన్నారు.

ఎంపీఎల్ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దు


వినతిపత్రం అందజేస్తున్న వెలిమినేడు గ్రామస్థులు

చిట్యాల, చిట్యాల రూరల్ జనవరి 8: మండలంలోని వెలిమినేడులో గల ఎంపీఎల్ పరిశ్రమ విస్తరణకు అనుమతి ఇవ్వొద్దని ఆ గ్రామస్థులు కోరారు. తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 19న కంపెనీ విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ ఉందని, దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వొద్దని కోరారు. ఇప్పటికే కాలష్యంతో ఇబ్బందులు పడుతున్నామని, కంపెనీని విస్తరిస్తే కాలుష్యం ఎక్కువై బతకడం కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బైకాని నాగరాజు, నల్లగంటి నర్సింహ్మారెడ్డి, దుర్గం లింగస్వామి, వడ్డేపల్లి చింటూ, బైకాని స్వామి, ఏర్పుల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కారానికి కృషి

చిట్యాల, జనవరి 8: మహిళల సమస్యల పరిష్కారానికి ఐద్వా కృషి చేస్తుందని సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ అన్నారు. చిట్యాలలో సోమవారం ఐద్వా సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వలన సామాన్యుడి బతుకు భారంగా మారిందన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న అతిపెద్ద సంఘం ఐద్వా అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల కావేరి, ప్రియాంక, పద్మ, ఇందిర, సులోచన, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘం భవనానికి నిధులు కేటాయించాలి

దామరచర్ల, జనవరి 8: మండలంలోని కొండ్రపోల్ గ్రామ మహిళా సంఘం భవనానికి రూ.10లక్షల నిధులు కేటాయించాలని కాంగ్రెస్ యువజన నాయకుడు పరంగి సురేష్ కోరారు. నల్లగొండలో డీఆర్‌డీవో పీడీ కాళిందినికి సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో దాతల సహకారంతో ఇచ్చిన మూడు గుంటల స్థలంలో భవన నిర్మించాలని కోరారు. 900మంది సంఘంలో సభ్యులుగా ఉన్నా వారికి సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు పరంగి అశోక్ ఉన్నారు.

సీఎస్‌సీ కామన్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

హాలియా, జనవరి 8: హాలియాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొత్తపల్లిలో సీఎస్‌సీ కామన్ సర్వీస్ సెంటర్‌ను సంఘం ప్రెసిడెంట్ ఆర్. మధుసూదన్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కామన్ సర్వీస్ 20సెంటర్ల ద్వారా 300 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఆధార్, పాన్, రైల్వే టికెట్ బుకింగ్, బ్యాంకింగ్, భీమా, హెల్త్ తదితర సర్వీస్‌లను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ఆర్.చినబిక్షం, సత్యనారాయణ, నాగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ముత్తమ్మ, వెకటయ్య, ధనలక్ష్మీ, నర్సిరెడ్డి, బ్యాంక్ మేనేజర్ అలివేలు, కార్యదర్శి ఆర్.సత్యం తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

హాలియా, జనవరి 8: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం కోరారు. సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ ఉర్లగొండ వెంకటయ్య మాట్లాడుతూ పది రోజులుగా పంగవానికుంటలో మిషన్ భగీరథ మంచినీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశానికి ముగ్గురు సర్పంచులు మాత్రమే హాజరు కావడంతో మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. కార్యక్రమంలో హాలియా వ్యవసాయ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో లక్ష్మి, వైస్ ఎంపీపీ మాలే అరుణ సత్యనారాయణరెడ్డి, ఎంపీవో వెంకటేశ్వర్లు, ఎంఈవో బాలునాయక్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తిప్పర్తి, జనవరి 8: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రతీక్‌రెడ్డి జ్ఞాపకార్థం మండలంలోని మామిడాలలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లెద్దు నాగమణి, అంబేద్కర్, ఎంపీటీసీ కొత్తపల్లి సిరివెన్నెల, ఈదయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, పాదూరి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జాకటి మోష, నలపరాజు శ్రీనివాస్, కుక్కల రమేష్‌రెడ్డి, చెన్నకేశవులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం : ఎమ్మెల్యే వీరేశం


నార్కట్‌పల్లి: వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి, జనవరి 8: ఆరోగ్యమే మహాభాగ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ గ్రేటర్ ఆధ్వర్యంలో లయన్ బండ సాగర్‌రెడ్డి సౌజన్యంతో యశోద (మలక్‌పేట్) ఆసుపత్రి వైద్య బృందంచే సోమవారం నార్కట్‌పల్లి మండలంలోని చిన్నతుమ్మలగూడెంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. లయన్స్ క్లబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేసిందని, ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10లక్షల గరిష్ట మొత్తానికి పెంచిందని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, సర్పంచ్ దాసరి రాజు, ఎంపీటీసీ ఉండ్ర భాగ్యమ్మా లింగారెడ్డి, లయన్ క్లబ్ మల్టిపుల్ చైర్మన్ తీగల మోహన్‌రావు, బండా సాగర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, సామ నరేందర్‌రెడ్డి, దొండ రమేశ్, బింగి కొండయ్య, సిద్దగోని స్వామి, ఎంపీడీవో యాదగిరి, శివకోటి శేఖర్, మల్లేశ్ పాల్గొన్నారు.

నకిరేకల్: రైతులు భూపరీక్ష యంత్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో నకిరేకల్ రైతు ఉత్పత్తి దారుల కంపెనీకి నాబార్డ్ తెలంగాణ సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అండ్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో భూపరీక్ష యంత్రాన్ని అగ్రికల్చర్ అధికారులతో కలిసి ప్రారంభించారు. భూపరీక్ష యంత్రం పని విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

చిట్యాల రూరల్: ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను నకిరేకల్‌లో ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం ఆవిష్కరించారు. మత్స్యకార సహకార సంఘం అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఉప్పరబోయిన స్వామి, వెలుగు రవి, నూతి వెంకటేశ్వర్లు, కనుకు వెంకటనారాయణ, నక్క రాంబాబేష్, పందిరి శ్రీనివాస్, సాదుల నర్సయ్య, బుంగపట్ల తిమ్మయ్య, గుడిసె యాదయ్య, దశరథ, సత్యం, రామలింగం, లింగస్వామి ఉన్నారు.

మాడ్గులపల్లి: మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో ఇటీవల దొంగతనాలు పెరిగాయని, వాటి నివారణకు గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు పతాని శ్రీను, బంటు రాజు, నకిరేకంటి అబి ఉన్నారు.

చండూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ కళ్యాణి మినహా ఎంపీటీసీలూ ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు. కోరం లేనందునా సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. మండలంలోని 23మంది సర్పంచులకు గాను ఐదుగురు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీడీవో యాకూబ్‌నాయక్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనగల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పెదఅడిశర్లపల్లి మండల ఉపాధి హామీ టీఏ అనుముల మండలానికి చెందిన కుంటిగొర్ల రవి భార్య మంజులకు ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ల జిల్లా యూనియన్ అధ్యక్షుడు మహేశ్వరం రమేష్ ఆధ్వర్యంలో డీఆర్‌డీవో కార్యాలయంలో డీఆర్‌డీవో కాళిందిని, అడిషనల్ డీఆర్‌డీవో నవీన్‌కుమార్, డీవీవో వేణుగోపాల్‌రావ్ రూ.20 వేల ఆర్థిక అందజేశారు. కార్యక్రమంలో రమేష్, ప్రవీణ్, యాదగిరి, ఎల్లయ్య, శ్రీను, సైదులు తదితరులున్నారు.

కనగల్: కనగల్ గ్రామానికి చెందిన నాగార్జున మహేశ్వరికి ఇంపాక్ట్ ఫౌండేషన్, టీటీడబ్ల్యూఎస్ సర్టిఫికెట్‌ను ఆ సంస్థ వ్యవస్థాపకుడు గంప నాగేశ్వర్‌రావ్ హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వరి మాట్లాడుతూ ఇంపాక్ట్ ఫౌండేషన్‌నుంచి టీటీడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సంక్షిప్త సమాచారం..

కనగల్: పీఆర్‌టీయూటీఎస్ 2024 క్యాలెండర్ డైరీని కనగల్ మోడల్ స్కూల్‌లో పీఆర్‌టీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీపీ కరీంపాష, జడ్పీటీసీ చిట్లవెంకటేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, ఎంపీడీవో సోమసుందర్‌రెడ్డి, ఎంఈవో తరి రాములు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు తిరందాసు సత్తయ్య, వేమిరెడ్డి సైదిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: అభిమానులు సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యులు కావాలని జూనియర్ ఎన్‌టీఆర్ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు లాకా రాజశేఖర్ అన్నారు. ఎన్‌టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు, దివ్యాంగులకు సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇండ్ల గణేష్, బంటు రాజు, సమ్మెట ఉపేందర్, శీలం గిరి, పండు, శేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం: కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి సాధ్యమని జడ్పీటీసీ ధనావత్ భారతి అన్నారు. మండలంలోని వస్త్రాంతండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, సలహాదారు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, సర్పంచ్ గౌతమి, ఎంపీటీసీ అనిల్‌కుమార్, పాండునాయక్ పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): పీఆర్‌టీయూటీఎస్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను ఎంఈవో రాము, మండల నోడల్ అధికారి కొనమంచిలి శ్రీనివాస్ మండలకేంద్రంలో ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కొంగరి సత్యనారాయణ మాట్లాడుతూ నూతన ప్రభుత్వంలో సీపీఎస్ రద్దు, జీవో 317వంటి సమస్యలు పీఆర్‌టీయూ టీఎస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాపోలు పరమేష్, వెంకటేశ్వర్లు, మొక్క పరుశురాం, ఆవుల మధుసూదన్, కూన్‌రెడ్డి సైదిరెడ్డి, బానోతు శ్రీను, విజయ్‌చందర్, పుట్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పగడాల లింగయ్య కోరారు. మర్రిగూడలో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనపై ప్రజలు విసిగి చెంది ఉన్నారని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. మాజీ కేసీఆర్ ప్రజలకు మోసపూరితమైన మాటలు చెప్పి సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమైయారన్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను వెంటనే అమలు చేసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి పుప్పాల యాదయ్య, రాములు, నరేష్, నర్సింహలు తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూరు: కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలిగా కట్టంగూర్‌కు చెందిన మేడి ఈశ్వరమ్మను నియమితులయ్యారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగోని మాధవి నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నార్కట్‌పల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 11న ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో యాదగిరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత అన్ని విభాగాల మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఆయన సూచించారు.

కొండమల్లేపల్లి : పీఆర్టీయూ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కొండమల్లేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో మాత్రునాయక్ ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ నోడల్ ఆఫీసర్, హెచ్ఎం సిహెచ్. శ్రీనివాస్, కాంప్లెక్స్ సెక్రెటరి ఎస్.చీన్యనాయక్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వాసికర్ల రమేశ్, గాదెపాక జగదీశ్వర్ పాల్గొన్నారు.

వేములపల్లి: తెలంగాణ ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం తగదని సల్కునూరు పీఏసీఎస్ చైర్మన్ గడ్డం స్పీధర్‌రెడ్డి అన్నారు. సల్కునూరు పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బోయినపల్లి వినోద్‌కుమార్ తన అన్న కూతురుకి విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇప్పించుకొని ఇంట్లో ఉంచి జీతం ఇస్తున్నారని కొంత మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. వినోద్‌కుమార్‌కు అసలు అన్న లేరని, దగ్గర బంధువుల్లో కూడా అలాంటి వారు ఎవరూ లేరన్నారు.